క్లుప్తంగా

ఆస్పత్రుల పరిశీలన



వాజేడు : మండలంలోని వాజేడు, పేరూరు వైద్యశాలలను కాయకల్ప అవార్డు ఎంపిక కోసం సోమవారం వైద్యులు పరిశీలించారు. వాజేడు వైద్యశాలను బ్రాహ్మణపల్లి వైద్యాధికారి నిఖిల్ కుమార్, పేరూరు వైద్యశాలను వాజేడు వైద్యాధికారి మహేందర్ పరిశీలించారు. మందుల గది, పరిసరాలు, వ్యాక్సిన్ గది, ల్యాబ్, ఆస్పత్రి శుభ్రత, ఇతర అంశాలను పరిశీలించారు. నమోదు చేసుకున్న అంశాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఈ కార్యక్రమంలో పేరూరు వైద్యాధికారి ర్థాహిల్, కోటిరెడ్డి, వెంకటరమణ, రఘు, భాగ్య, శిరీష, చిన్న వెంకటేష్, లఖాన్, రజని కాంత్, అశ్విని, సతీష్ ఉన్నారు.

అభినందన

వెంకటాపురం(ఎం) : హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అథ్లెటిక్ పోటీల్లో 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో వెంకటాపురం మైనార్టీ కళాశాలకు చెందిన ఎస్‌కె. రేష్మా అత్యంత ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతి గెలుచుకున్నట్లు ప్రిన్సిపాల్ వందన, పీడీ నవ్య తెలిపారు. రేష్మాకు సర్టిఫికెట్‌తో పాటు మెడల్‌ను నిర్వాహకులు అందజేసినట్లు వెల్లడించారు. తృతీయ బహుమతి గెలుచుకున్న రేష్మాను క్రీడాకారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

‘వానరాల బెడద నుంచి కాపాడండి’

గోవిందరావుపేట : వానరాల (కోతులు) సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి సోమా మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పస్రా అభ్యుదయ కాలనీలో సోమవారం స్థానికులపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ అధికారులు చొరవ తీసుకోని కోతులను పట్టుకొని అడవిలో వదలాలని కోరారు. ఇప్పటికే మండలంలో అనేక మంది కోతుల దాడుల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారని చెప్పారు.

‘సమాచారం ఇవ్వండి’

వెంకటాపురం(కె) : పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై కోర్టుకు హాజరు కాకుండా ఇద్దరు వ్యక్తులు తప్పించుకు తిరుగుతున్నారని వారి సమాచారం ఎవరికైన తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై కొప్పుల తిరుపతి రావు సోమవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన ఉయిక రంజిత్, పూనెం భద్రు కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తిరుగుతున్నారని చెప్పారు. వీరిద్దరు జనవరి 7వ తేదీన కోర్టులో హాజరు కావాలని ఉత్తర్వులు జారీఅయినట్లు పేర్కొన్నారు. వీరి ఆచూకి తెలిస్తే 87126 0098, 90005 82833 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



శ్రీకాంత్‌రెడ్డి, అధ్యక్షుడు

ఎస్ఎస్‌తాడ్వాయి : తాడ్వాయి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన చల్లగొండ శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని జర్నలిస్టుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. కోగిల సారయ్య, బండారి లక్ష్మణ్, తిరువాయిముడి పురుషోత్తం, చింతల సంపత్, వినాయకరావు, ఠాకూర్ ప్రతాప్‌సింగ్, దేవేందర్, సమ్మయ్య, బోడ నర్సింగారావు పాల్గొన్నారు.

యాసంగి సాగులో బిజీబిజీ



నాట్లు వేస్తున్న కూలీలు



ఆడ, మగ నాటు వేసిన పొలం

- ప్రారంభమైన వరినాట్లు
- తగ్గిన కమర్షియల్ సాగు
- ఆడ, మగ(బాండ్) సాగు వైపే మొగ్గు

వాజేడు : మండల వ్యాప్తంగా యాసంగి వరి నాట్లు ప్రారంభమయ్యాయి. యాసంగిలో ఆడ, మగ (బాండ్) వరి సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సన్న రకాలైన 1010, 1156, 1271, కూనారం సన్నాలు, బతుకమ్మ, ఆర్ఎన్ఆర్, కామన్ రకాలైన ఎంటీయూ 1061, 1064, రకాల వైపు మొగ్గు చూపారు. వరి నారు పెరుగడంతో సాగు మొదలు పెట్టారు. అయితే ఎక్కువగా ఆడ, మగ (బాండ్) వరిసాగు వైపు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు.

తగ్గిన కమర్షియల్ సాగు

ప్రతీ ఏటా కమర్షియల్ సాగు వైపు మొగ్గు చూపే రైతులు ఈ సారి బాండ్ వరితో పాటు మొక్కజొన్న ఇతర పంటలు సాగు చేస్తున్నారు. బాండ్ వరికి ధర ఎక్కువగా ఉండటంతో కమర్షియల్ వరి పంటను తగ్గించారు.

ఆడ, మగ (బాండ్) వైపే మొగ్గు

వర్షాకాలంలో సాగు చేసిన వరి పంట దిగుబడులు తగ్గడంతో రైతుల్లో వరిసాగుపై ఆసక్తి తగ్గింది. దీంతో ఆడ, మగ (బాండ్) వరి పంట వైపు మొగ్గు చూపారు. అందులో భాగంగానే మండలంలో బాండ్ వరి సాగు విస్తీర్ణం పెరిగింది. మండలంలో మూడు రకాల కంపెనీల బాండ్ వరి సాగు అవుతుంది. అంతే కాకుండా వరి పంటను సాగు చేసే చోట కొందరు రైతులు బాండ్ మొక్క జొన్నను కూడా సాగు చేస్తున్నారు. ఇప్పటికే బాండ్ మొక్క జొన్న ఏపుగా పెరుగుతుండగా ఇప్పుడు బాండ్ వరి నాట్లను వేస్తున్నారు. ఒక వైపు దుక్కులు చేస్తున్న రైతులు వరి నాట్లను వేస్తూ బిజీ అయిపోయారు. మండల వ్యాప్తంగా గత ఏడాది 4,000 ఎకరాల్లో యాసంగి పంటను సాగు చేయగా ఈ ఏడాది కమర్షియల్ సాగు భారీగా తగ్గినట్లు తెలుస్తోంది. వ్యవసాయ పనులను ముమ్మరం చేసి నాట్లను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే ట్రాక్టర్ల ద్వారా దమ్ములు చేసిన రైతాంగం గుత్తా నాట్లను వేస్తున్నారు.

మెరుగైన సేవలు అందించాలి

- పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ రవీందర్



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ రవీందర్

గోవిందరావుపేట : వార్షిక తనిఖీల్లో భాగంగా ములుగు డీఎస్పీ ఎన్.రవీందర్ సోమవారం పస్రా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదంగా ప్రవర్తిస్తూ కేసుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకోని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలని డయల్-100 ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది బాధ్యయుతంగా ఉంటూ తమ విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని అన్నారు. రోడ్డు భద్రత, ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలతో పాటు యువతను అప్రమత్తం చేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం పెరిగేలా ప్రతి ఒక్కరూ ప్రవర్తించాలని అన్నారు. పస్రా ఏజెన్సీ ప్రాంతమైనందున మావోయిస్టు కార్యకలాపాలపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులు గిరిజన యువకులు, ప్రజలలో అనేక అపోహలు సృష్టించి వారి సాధారణ జీవనానికి విఘాతం కలిగించే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రజలతో మమేకమై వారి నుంచి సమాచారం సేకరిస్తూ మావోయిస్టు భావజాలం దరిచేరకుండా ప్రజలను, యువతను చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్. పోలీసులు పాల్గొన్నారు.

స్నైపర్ డాగ్‌తో ముమ్మర తనిఖీ

గోవిందరావుపేట : గోవిందరావుపేట, పస్రా గ్రామాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన స్నైపర్ డాగ్‌తో బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పస్రా ఎస్సై కమలాకర్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ పొందిన స్నైపర్ డాగ్ హత్యలు, దోపిడీలు, గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాలను పసిగట్టి పట్టించడం జరుగుతుందన్నారు.

దుప్పట్ల పంపిణీ



వాజేడు : ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్ సోమవారం దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. సంక్షేమ శాఖ ద్వారా వచ్చిన దుప్పట్లను 80 మంది విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు తప్పనిసరిగా వాటిని వినియోగించి చలి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది రమేశ్ ఉన్నారు.

చీరల పంపిణీ



వెంకటాపురం(కె) : మండల పరిధిలోని టేకుల బోరు, వెంగళరావుపేట, ముకునూరు పాలెం గ్రామాల్లో సోమవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పాయం రమణ 40 మందికి చీరలను అందజేశారు. చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు సాయిప్రకాశ్, పాస్టర్లు సోలోమోన్, గాబ్రెల్, ప్రసాద్, రాజేష్ తదితరులు ఉన్నారు.

వితంతువులకు..

వాజేడు : జంగాలపల్లిలో సోమవారం జీటీఎస్ఎస్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. నాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు విజయ్, పాస్టర్ శ్యామ్ చేతుల మీదుగా మహిళలకు చీరలు అందజేశారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల పరిధిలోని జంగాలపల్లి, పూసూరు, మండపాక, రామచంద్రాపురం, అబ్బాయిగూడెం, మొర్రవానిగూడెం బోదాపురం గ్రామాలకు చెందిన 40 మంది వితంతువులకు వీటిని అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ

ఏటూరునాగారం : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆకుల వారి ఘణపురంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను యూత్ సభ్యులు నిర్వహించారు. ఈ పోటీలను సీఐ ప్రారంభించి మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి యువకులు వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు రమేశ్, వెంకటేష్, చాట్ల రవి, రాజుతో పాటు యువకులు పాల్గొన్నారు.

రామారావు మృతి పార్టీకి తీరని లోటు



బాధితులను ఓదార్చుతున్న నాగజ్యోతి

ములుగు రూరల్ : బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తక్కళ్లపల్లి రామారావు ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. ఈ మేరకు సోమవారం కొత్తూరు గ్రామంలో రామరావు పార్థివదేహానికి పూలమాలలు వేసి, పార్టీ జెండా కప్పి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, గోవింద్ నాయక్, పాలెపు శ్రీనివాస్‌లతో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్రె సమ్మయ్య, దుర్గం రమణయ్య, రమేష్‌రెడ్డి, మహేష్, విజయరాంనాయక్, తిరుపతి, అంజన్ రావు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సీఆర్టీల అర్ధనగ్న ప్రదర్శన



ఏటూరునాగారం : మండల కేంద్రంలో సీఆర్టీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 8వ రోజు చేరుకుంది. దీంతో సీఆర్‌టీలు అర్ధనగ్నంగా ప్రదర్శన నిర్వహించి నిరనసన వ్యక్తం చేశారు. సీఆర్‌టీల రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ సోమేశ్వర్ మాట్లాడుతూ..8 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సీఆర్‌టీలకు సమాన పనికి..సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌టీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాడెం రవీందర్, జిల్లా అధ్యక్షుడు కొండా రామయ్య, ప్రధాన కార్యదర్శి ధరంసోత్ రాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తిరుపతి, హరిలాల్, భూక్య రాములు, మల్లయ్య, చందు, కిషన్, ప్రతాప్, శ్రీను, గట్టిపల్లి శ్రీనివాసు, యాప సంపత్ కుమార్, సుధాకర్, సరళ, సరిత, లక్ష్మి పాల్గొన్నారు.

క్రియాశీల సభ్యత్వాలు చేపట్టాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి



సమావేశంలో మాట్లాడుతున్న బంగారు శృతి

ములుగు రూరల్ : భారతీయ జనతా పార్టీ ఎన్నికల సంఘటన్ పర్వ్‌లో భాగంగా ప్రతి మండలంలో 50 క్రియాశీల సభ్యత్వాలు తప్పనిసరిగా చేపట్టాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జ్ బంగారు శృతి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో మూడు నెలలుగా జిల్లా సభ్యత్వ నమోదు విజయవంతగా పూర్తి చేసి జిల్లా నాయకులు మన్ననలు పొందారని అన్నారు. బూత్ ఎన్నికలు నిర్వహించి మండల అధ్యక్షుల నియామకాల్లో భాగంగా క్రియాశీల సభ్యత్వాలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మండల అధ్యక్షుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో బీజేపీని గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పెసరు విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణినాయక్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, చింతల పూడి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బలరాం, రవీంద్రాచారి, భూక్య జవహర్‌లాల్, వెంకట్, రాజునాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో అందని ద్రాక్షలా విద్య

- టీచర్లు లేక మూతబడుతున్న పాఠశాలలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె) : ఏజెన్సీలో ఆదివాసీలకు విద్య అందని ద్రాక్షలా మారిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యాయుడు ఉయిక శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని ఏడు పాఠశాలలకు ఉపాధ్యాయులు లేక పాఠశాలలు తెరవడం లేదన్నారు. వెంకటాపురం మండలంలోని కలిపాక, ముత్తారం, కన్నాయిగూడెం మండలంలో సర్వాయి, కన్నాయిగూడెం, వెంకట్రావ్‌పల్లి, ఏటూరునాగారం మండలంలోని వీరాపురం, శంకరాయిపల్లి, వెంకటాపురం (ఎం) మండలంలోని మల్లాయిపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతబడ్డాయని ఆయన ఆరోపించారు. మంత్రి సీతక్క సొంత జిల్లా ములుగులోనే ఆదివాసీలకు సక్రమంగా విద్యా అందటం లేదని వాపోయారు. పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలలకు రావడం లేదని సమయపాలన పాటించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఏజెన్సీలో ఉపాధ్యాయులు లేక మూతబడ్డ పాఠశాలలకు టీచర్లను నియమించి పాఠశాలలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. లేని పక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, కోర్సా నర్సింహామూర్తి తదితరులు ఉన్నారు.

కమిటీలో అవకాశం కల్పించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

వాజేడు : చెరుకూరుకు చెందిన పోశమ్మ ఇసుక క్వారీ కమిటీలో తమకు అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం స్థానికులు ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. పెసా గ్రామసభ నిర్వహించినప్పుడు చెరుకూరు, బయ్యారం, రేగులపాడు, మోతుకులగూడెం గ్రామాల నుంచి పాత కమిటీలోకి కొందరిని తీసుకుందామని ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. పెసా గ్రామ సభ అనంతరం చెరుకూరు గ్రామానికి చెందిన 9 మంది కమిటీ సభ్యులు మాత్రమే కొనసాగుతారని, వేరే గ్రామాల నుంచి కమిటీలోకి ఎవరిని తీసుకోవడం లేదని చెరుకూరు గ్రామస్తులు అంటున్నట్లు ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లారు. రేగుల పాడు, బయ్యారం, మోతుకుల గూడెం గ్రామాల్లో మహిళా సంఘాల నుంచి ఒక్కొక్కరిని కమిటీలో చేర్చుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఇంతకు ముందు జరిగిన పెసా గ్రామ సభను రద్దు చేయాలని కోరుతూ 44 మంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓకు అందించారు.

సంకెళ్లతో వినూత్న నిరసన



గోవిందరావుపేట: సంకెళ్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



ములుగు రూరల్: నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గోవిందరావుపేట : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి సోమా మల్లారెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ ప్రాగంణంలో సోమవారం అఖిల భారత వామపక్షాల పిలుపు మేరకు అంబేడ్కర్ చిత్రపటం ఎదుట చేతులకు సంకెళ్లు వేసుకోని భారత మాత చిత్రపటాన్ని భారత రాజ్యాంగాన్ని కాపాడండి..ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. అనంతరం జరిగిన సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన అమిత్ షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, మండల కమిటీ సభ్యులు ఉపేంద్ర చారి, మురళి, ఎస్డీ అజాద్, చంద్రారెడ్డి, సూర్యనారయణ, రామస్వామి, లెనిన్, కోటేశ్వరరావు, నాగరాజు, బ్రహ్మాచారి, శ్రీనివాస్, కారం రజిత, సువర్ణ, అరుణ్, జీవన్,శ్రావణ్,అశోక్ ఐలయ్య పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి

ములుగు రూరల్ : అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు, బ్యానర్లతో నిరసన తెలిపారు. మనువాద సిద్ధాంతాలను అమలు చేసేందుకు రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు వెంకట్‌రెడ్డి, రాజేందర్, గఫూర్‌పాషా, ఐలయ్య, ప్రవీణ్, దేవేందర్, సంపత్, రవీందర్, ముత్యాల రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి



జెండా ఆవిష్కరిస్తున్న రవి

ములుగు రూరల్ : విద్యార్థుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) పని చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సంఘం 55వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎస్ఎఫ్ఐ అధ్యయనం, పోరాటం నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాల్కర్ షిప్, ఫీజుల రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మోరె లక్ష్మణ్, భరత్, ముష్రాఫ్, రాజు, సందీప్, నవ్య, పూజిత, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



ములుగు రూరల్ : మండలంలోని బండారుపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు సోమవారం లయన్స్ కొండి సాంబశివ సహకారంతో కంటి పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో మొత్తం 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 13 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యుడు తిరుమలరావు తెలిపారు. బాధితులకు కంటి ఆపరేషన్లు చేయించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్‌రెడ్డి, జంజిరాల దేవయ్య, లయన్స్ ప్రెసిడెంట్ మేరుగు రమేష్, చుంచు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

వాజేడు : మండల కేంద్రంలో జనవరి 8వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఆదివాసీల హక్కులు, చట్టాల అవగాహన సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు మద్ద నర్సింహులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం కోరం సందీప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ 5, 6వ షెడ్యూల్ ప్రాంతాలపై ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలపై ఆదివాసీలు తెలుసు కోవాలన్నారు. యువకులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మడకం గణేష్, పొడెం రాజేష్, గుర్రపు సాయి తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ములుగు రూరల్ : యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, వాటికి దూరంగా ఉండాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ మమన్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సమాజాన్ని కాపాడాలని నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. రోహిత్, శ్రీనాథ్, సాయిరాం, శ్రీతన్, అరుణ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వెంకటాపురం(ఎం) : జిల్లా కేంద్రంలో జనవరి 6న జరిగే దళితబంధు లబ్ధిదారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని సోమవారం మండలంలోని లక్ష్మీదేవిపేటలో ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను రాష్ట్ర నాయకులు జనగాం రవీందర్, దర్శనాల సంజీవ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆత్మగౌరవ సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పత్తిరి దశరథం, సామర్ల రాజమౌళి, బిక్షపతి, రవి, నాగరాజు, భద్రయ్య, తిరుపతి, ఆనందం, శంకర్, మహేష్ పాల్గొన్నారు.

సన్మానం



గోవిందరావుపేట : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన మేడిశెట్టి సుధాకర్ను ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. అతిథులుగా మండల విద్యాధికారి గొంది దివాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాయమ ఉపాధ్యాయుడిగా గతంలో వాలీబాల్ క్రీడా రంగంలో ఎంతో మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం సుధాకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రశాంతి, రవి, రామకృష్ణ, జోగా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌ను సంతోషంగా జరుపుకోవాలి

గోవిందరావుపేట/వెంకటాపురం(కె)/మంగపేట/ఎస్ఎస్‌తాడ్వాయి : న్యూ ఇయర్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్, వెంకటాపురం సీఐ బండారి కుమార్, మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి,తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. ఈ మేరకు ఆయా పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. న్యూ ఇయర్ వేడుకల్లో గంజాయి, డ్రగ్స్ తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా డీజేలు అధిక శబ్దం వచ్చే బాక్సులు వినియోగించరాదని, బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించినా వారిపై కఠిన చర్యలు తప్పవని, న్యూ ఇయర్ వేడుకలను 12:30గంటల వరకు జరుపుకోవాలని సూచించారు. రోడ్ల పై కేక్ కటింగ్, న్యూసెన్స్ చేసినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.